"పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి అతనో్నసారి చూసొద్దాం." చెప్పాడు రెండవకొడుకు.

అది ఆ యింటి సభ్యులందరి మనసులోని మాట. ఎలక్ట్రిక్ బ్రెడ్‌టోస్టర్, కేసెట్స్‌పోయినా వాటిగురించి కాదు_అతన్ని చూడాలను కునేది.

# కలెక్షన్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మధ్యాహ్నం రెండూ ఇరవై ఐదుకి వచ్చింది గుంటూరునుంచి వచ్చే గోల్కొండ ఎక్స్‌ప్రెస్_ఆరోజు కూడా లేటే.

అందులోంచి దిగిన ప్రయాణికులు చేతిలో సామానుతో ప్లాట్ ఫారం నుంచి బయటకువెళ్ళే గేటువైపు నడవసాగారు. వారిలో ఏభై ఐదేళ్ళ వృద్ధుడుకూడా వున్నాడు. ఆయన పన్నెండేళ్ళ వయసున్న ఓ పాప చేతిని పట్టుకునినడిపిస్తున్నాడు. నల్లకళ్ళజోడు పెట్టుకొని వుంది ఆమె. ఆ పాప ఆయన చేతిని పట్టుకుని నడుస్తున్న తీరును చూస్తుంటే ఆమె గుడ్డిది అని తెలుస్తున్నది.

గేటుదగ్గర బాగా రద్దీగావుంది. ఆ పాప గేటుదగ్గరఉన్న అనేక మందిని ఢీకొట్టింది కళ్ళుకనపడక పోవటంతో. వాళ్ళు విసురుగా చూసారు ఆ పాపవంక. ఆమె గుడ్డిదని తెలియగానే పక్కకు జరిగి చోటు యివ్వ సాగారు.

ఎంతో అందంగావున్న ఆ పాపకు కళ్ళు కనడకపోవడం వారిని బాధించింది. ఆమెవంక జాలిగా సానుభూతిగా చూశారు.

ఆయన రెండు టిక్కెట్లని టి. సి. చేతిలో వుంచి బయటకు నడిచాడు ఆమెతో.

ట్రాఫిక్ పోలీస్ కానిస్టేబుల్ ప్రయాణీకులకి ఆటోలు కేటాయిస్తున్నాడు. అతను లేకపోతే ఆటోవాళ్ళు మీటర్ రేటుకి రాక బేరం ఆడుతూండటం మామూలే.

ఆ ముసలాయన పాపను ఓ ఆటోలో ఎక్కించి తను ఎక్కి చెప్పాడు ఆటో డ్రయివర్ కి.

"మౌలాలీ"

ఆటో స్టేషన్ ఆవరణలోంచి బయటకువచ్చాక ఆ పాపవల్లకళ్ళజోడు తీసి ఆయనవంక చూసి నవ్వి అడిగింది.

"ఎంత ఇవాళ కలెక్షను?"

ఆయన పాప అందించిన పది పర్సులని జేబులోంచి తీసి అందులోని డబ్బుతీసి లెక్కపెట్టి చెప్పాడు.

"నిన్న నాంపల్లి స్టేషనులో సంపాదనకన్నా ఎక్కువే. నాలుగు వేల ఆరువందల ఏభై రెండు" చెప్పాడు.

పాప కుడిచేతిని తన చేతుల్లోకి తీసుకొని ఆనందంగా నొక్కాడు ఆ చేతిని.

ఆ పాప చందమామని తెరచి చదవసాగింది.

# గుప్తజ్ఞాన్

అర్ధరాత్రి-

నిశ్శబ్దం_

ఆ నిశబ్దాన్ని ఛేదిస్తూ రైలు చక్రాల లయ. ఫస్టుక్లాస్ కంపార్టుమెంటులో ఒంటరిగా ఆమె ఆమె వంటరితనాన్ని భంగపరుస్తూ అతను